కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో.. టమాట 20, పచ్చిమిర్చి 70, బెండ 50, కాకర 50, దొండ 40, దోస 30, ఆలు 30, చామ 60, కీర 30, బీర 50, వంకాయ 30, గోకర 50, బీన్స్ 80, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 70, క్యాబేజీ 30, క్యారెట్ 40, చిక్కుడు 60, ఉల్లి 25(కేజీ), ములక్కాయలు (2)10 , క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 20, అల్లం 140, వెల్లుల్లి 200.

'వీవర్స్ టు కస్టమర్స్' ప్రారంభం



రాయదుర్గం: హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని మైహోమ్ భుజ గ్రౌండ్ ఫ్లోర్‌లో 'వీవర్స్ ఎగ్జిబిషన్'ను ప్రారంభించారు. ఈ ఎగ్జిబిషన్‌ను ప్రముఖ మోడల్ లక్ష్మీ ఆయాల, నిర్వాహకురాలు శ్రీలతతో కలిసి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. హ్యాండీక్రాఫ్ట్స్, వివిధ రకాల ఆభరణాలు, జెమ్స్, చేనేత చీరలు తదితరాలను అందుబాటులో ఉంచారు. 14 రాష్ట్రాలకు చెందిన చేనేత, చేతి వృత్తి కళాకారులు పాల్గొన్నారు. ఈ ఎగ్జిబిషన్ రెండు రోజుల పాటు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

ఫార్మా కంపెనీకి తాళం

మియాపూర్ : చందానగర్ సర్కిల్–21 పరిధిలోని మియాపూర్‌లో ఉన్న హరిజన్ ఫార్మా కంపెనీ ఆర్సీ పన్నులు చెల్లించకుండా కాలయాపన చేస్తున్నందున జీహెచ్ఎంసీ అధికారులు శనివారం కంపెనీకి తాళం వేశారు. జీహెచ్ఎంసీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్‌లోని హరిజన్ ఫార్మా కంపెనీ గత కొన్ని సంవత్సరాలుగా ఆర్సీ పన్నులు రూ.కోటి నలభైఆరు లక్షలు (వడ్డీతో కలిపి) చెల్లించాల్సి ఉంది. గత కొన్ని సంవత్సరాలుగా ఆర్సీ పన్నులు చెల్లించనందున జీహెచ్ఎంసీ అధికారులు కంపెనీకి నోటీసులు పంపారు. స్పందించకపోవడంతో జీహెచ్ఎంసీ శానిటేషన్ సూపర్‌వైజర్ శ్రీనివాస్ సిబ్బందితో కలిసి కంపెనీ గేట్లకు తాళాలు వేశారు.

బొల్లారంలో..



పరిశ్రమ గేట్‌కు తాళం వేస్తున్న అధికారులు

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలో గల పరిశ్రమల నుంచి అధికారులు పన్నులు వసూలు చేస్తున్నారు. భారీగా పన్ను బకాయిలు ఉన్న పరిశ్రమలపై అధికారులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. పన్ను చెల్లించనందుకు శనివారం బొల్లారంలోని ఓ స్టీల్ యూనిట్–4 పరిశ్రమకు మున్సిపల్ కమిషనర్ మంగతాయారు ఆదేశాల మేరకు అధికారులు తాళం వేశారు. పరిశ్రమల యాజమాన్యాలు సకాలంలో పన్నులను చెల్లించాలని సూచించారు.

అలరించిన కళా నీరాజనం



మాదాపూర్: శిల్పారామంలో శనివారం ఎస్‌వీఎస్ కళానికేతన్ కళా నీరాజనం కూచిపూడి నృత్యప్రదర్శనతో అలరించారు. హేమ వనసర్ల శిష్యబృందం వినాయకకౌతం, చక్కనితల్లికి, బాలాత్రిపుర సుందరి, మూషిక వాహన, ముద్దుగారే యశోద, రామ కోదండ రామ, జతిస్వరం, అష్టలక్ష్మీ, పుష్పాంజలి తదితర అంశాలను ప్రదర్శించి అలరించారు. కార్యక్రమంలో కళాకారులు జస్విత్రశ్రీ, తన్మయి, హర్షిణి, శ్రీదర్శిని, సహస్ర, అనన్య, అనూష ,శ్రీప్రియ, ధన్విత, రితిక, భవ్యశ్రీ, కాత్యాయిని, వర్ష తదితరులు పాల్గొన్నారు. నాట్యగురువులు రాధేశ్యామ్, పద్మకళ్యాణ్‌లు కళాకారులను సత్కరించారు.

కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిద్దాం



మాట్లాడుతున్న రవికుమార్

హఫీజ్‌పేట్: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ చేవెళ్ల అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిద్దామని పార్టీ శేరిలింగంపల్లి కంటెస్టెడ్ ఎమ్మెల్యే రవికుమార్ యాదవ్ పేర్కొన్నారు. శనివారం మాదాపూర్ డివిజన్ పరిధిలోని మాధవరంనగర్‌లో పార్టీ డివిజన్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీ అభ్యర్థి కొండ విశ్వేశ్వర్‌రెడ్డి సోదరీమణి అనితారెడ్డి, ఎలక్షన్ ఇంచార్జి శ్రీధర్‌రెడ్డి, డివిజన్ ఇంచార్జి బుచ్చిరెడ్డిలతో ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. డివిజన్‌లో కమిటీలు, శక్తి కేంద్రాల ఇంచార్జిలు, బూత్ అధ్యక్షుల నియామకంపై చర్చించారు. కార్యక్రమంలో నాయకులు మదనాచారి, శ్రీశైలం, శ్రీనివాస్‌రెడ్డి, యాదయ్య, గోవర్ధన్‌రెడ్డి, కల్పన, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్ కేఫ్, బార్ ప్రారంభం

మాదాపూర్: మాదాపూర్‌లోని క్యాపిటల్ పార్కులో ఎఫ్ కేఫ్, బార్‌ను శనివారం ప్రారంభించారు. బిగ్‌బాస్ సన్నీ, అర్జున్, మెహబూబ్, అశ్విని, తనీస్, నవీన్, మహేశ్‌లతో పాటు పలువురు సినీతారలు పాల్గొన్నారు. రుచికరమైన పానీయాలు, ఫుడ్, పల్సెటింగ్ బీట్‌లు, లైవ్ మ్యూజిక్ ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

రోడ్డుపై పొగలు.. ఆందోళనలో ప్రజలు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి జీహెచ్ఎంసీ కార్యాలయం నుంచి ఆలిండ్ కంపెనీ రోడ్డుపై పొగ అలుముకుంది. మధ్యాహ్నం ఒక్కసారిగా పొగలు రావడంతో స్థానికులు అగ్నిమాపకదళం, డీఆర్ఎఫ్ బృందంకు సమాచారం ఇవ్వడంతో వారు సకాలంలో ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. ప్రధానరోడ్డు పక్కన ఉన్న ఖాళీ స్థలంలో గడ్డి, చెత్తా చెదారం, వ్యర్థాలపై కొందరు వ్యక్తులు సిగరెట్ ఆర్పకుండా పారవేయడంతో మంటలు చెలరేగాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పివేయడంతో వాహనదారులు ఊపిరి పీల్చుకొన్నారు.



లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలో జరుగుతున్న కల్వర్టు పనులు

కల్వర్టు పనులు పూర్తి కావొచ్చాయి..

- రూ. 4కోట్ల వ్యయంతో బాక్స్‌టైప్ కల్వర్టు నిర్మాణం
- లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వరద సమస్యకు చెక్

శేరిలింగంపల్లి: లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద గత కొన్ని దశాబ్దాలుగా చిన్నపాటి వర్షం పడినా వరద నీరు బ్రిడ్జి కింద నిలిచిపోవడం.. రోజుల తరబడి వాహనాల రాకపోకలు నిలిపివేసి, లింగంపల్లి మార్కెట్ మీదగా, నల్లగండ్ల ఆర్‌టీబీ మీదుగా రాకపోకలు మళ్ళించడం జరిగేది. దీంతో వర్షాలు పడతాయంటే ఆ ప్రాంతవాసులు భయపడేవారు. బ్రిడ్జి కింద వరదనీరు నిల్వ ఉంటే రాకపోకలు ఇబ్బంది అని వాపోయేవారు. ఈ క్రమంలో బాక్స్‌టైప్ కల్వర్టు, బాక్స్‌టైప్ డ్రెయిన్ నిర్మించాలని పనులు ప్రారంభించారు. ప్రస్తుతం కల్వర్టు పనులు దాదాపు పూర్తి కావొచ్చాయి. మిగిలిన ఇక బాక్స్ టైప్ డ్రెయిన్ నిర్మాణం పూర్తి అయితే దాదాపుగా సమస్య పరిష్కారమవుతుందని అందరూ భావిస్తున్నారు. గత ఏడాది ఆగష్టు 28వ తేదీ ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పనులకు శంకుస్థాపన చేశారు. 4 కోట్ల రూపాయలతో

- బాక్స్‌టైప్ కల్వర్టు, బాక్స్‌టైప్ డ్రెయిన్ నిర్మాణ పనులు చేపట్టారు. బాక్స్‌టైప్ కల్వర్టు పనులను మూడు దశల్లో స్లాబ్ వర్క్‌ను పూర్తి చేశారు. ఈ పనులను ఎమ్మెల్యే గాంధీ, అధికారులు పర్యవేక్షిస్తూ వచ్చారు. పనులు దాదాపుగా పూర్తికావడంతో వాహనదారులు, స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

వర్షాకాలం నాటికి పూర్తి

లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద చేపట్టిన బాక్స్‌టైప్ కల్వర్టు పనులు పూర్తి చేశాం. మిగిలిన పనులను కూడా పూర్తి చేసి రాకపోకలకు ఇబ్బందులు తొలగిస్తాం. బాక్స్ టైప్ డ్రైన్ పనులను కూడా వెంటనే చేపడతాం. వర్షాకాలం ప్రారంభమయ్యే సరికి పూర్తి చేయాలనుకుంటున్నాం.

– సంతోష్‌కుమార్‌రెడ్డి, ఏఈఈ, చందానగర్ సర్కిల్

నేషనల్ బిజినెస్ లీడర్ అవార్డులు



అవార్డును అందిస్తున్న మల్లారెడ్డి నారాయణ హెల్త్‌సిటీ డాక్టర్ ప్రీతిరెడ్డి

రాయదుర్గం: హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్‌లో ట్యాక్స్ ఫిల్లింగ్ ఇండియా ఆధ్వర్యంలో 60 మంది పారిశ్రామిక వేత్తలకు నేషనల్ బిజినెస్ లీడర్ అవార్డులను ప్రదానం చేశారు. రాష్ట్ర హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి చంద్రకుమార్, ఆదాయ పన్ను కమిషనర్ జీవన్‌లాల్ జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి చంద్రకుమార్ మాట్లాడుతూ విజయం సాధించడంలో దృఢ సంకల్పం, ఆత్మవిశ్వాసం అవసరమన్నారు . 60 మంది పారిశ్రామికవేత్తలకు నేషనల్ బిజినెస్ లీడర్ అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ట్యాక్స్ ఫిల్లింగ్ ఇండియా, నేషనల్ బిజినెస్ లీడర్ అవార్డుల వ్యవస్థాపకుడు చల్లూరి శ్రీనివాస్, వరల్డ్ ఎన్విరాన్‌మెంట్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు సిహెచ్ వీరభద్ర, సీఐఎస్ఎఫ్ కమాండో శిల్పా శ్రీవాత్సవ, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్, మల్లారెడ్డి నారాయణ హెల్త్‌సిటీ డాక్టర్ ప్రీతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అవార్డులు పొందిన వారిలో డాక్టర్స్ ప్రాపర్టీస్ ఎండి తమ్మినేని సత్యనారాయణ, సంకల్ప్ గ్రూప్‌కు చెందిన వీర్‌విక్రమ్, పినాకిల్ ఎడ్యుకేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సత్యశ్రీగుప్తా, వజ్ర ఈవెంట్స్ అరుణ్, మహ్మద్ గులామ్, అల్లు గోవిందరెడ్డి, జెమ్ ఓపెన్ క్యాబ్ సీఈఓ వినోద్, బీఓఆర్ వ్యవస్థాపకుడు ప్రశాంత్ అవార్డులు పొందారు.

వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



హోమంలో పాల్గొన్న అధికారులు, నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని వీరన్నగూడ గ్రామంలో గల భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ఈఓ శశిధర్ గుప్తా ఆధ్వర్యంలో ఉదయం నుంచి స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి సన్నిధిలో హోమం, అభిషేకం, అమ్మవారి సన్నిధిలో కుంకుమార్చన చేశారు. స్వామి, అమ్మవార్లకు అధికారులు పట్టువస్త్రాలను సమర్పించారు. ఎనిమిది రోజుల పాటు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నామని, భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఈఓ కోరారు. కార్యక్రమంలో తహశీల్దార్ గంగాభవాని, దేవాలయ సిబ్బంది సోమయ్య, రవీంద్రమూర్తి, స్థానిక నాయకులు ప్రతాప్‌రెడ్డి, వేణు, నర్సింగ్‌రావు, గోవర్ధన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో యూనివర్సిటీ ఫెయిర్



ఫెయిర్‌లో పాల్గొన్న యూనివర్సిటీల ప్రతినిధులు, విద్యార్థులు

శేరిలింగంపల్లి: విలువలతో కూడిన విద్యను అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎపిస్టిమో వికాస్ లీడర్‌షిప్ పాఠశాల ప్రధానాచార్యులు పద్మకొల్లి పేర్కొన్నారు. నల్లగండ్లలోని ఎపిస్టిమో వికాస్ లీడర్‌షిప్ పాఠశాలలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన మెగా యూనివర్సిటీ ఫెయిర్‌ను శనివారం నిర్వహించారు. దీన్ని ప్రారంభించిన ఆమె మాట్లాడుతూ వచ్చే విద్యాసంవత్సరం నుంచి పాఠశాలలో 11వ తరగతిని కూడా ప్రారంభించనున్నామన్నారు. ఉప ప్రధానాచార్యులు వాణి, పాఠశాల కౌన్సిలింగ్ విభాగం అధిపతి రజిత మాట్లాడుతూ విద్యారంగంలో వస్తున్న మార్పుల గురించి తల్లిదండ్రులు, విద్యార్థులతో చర్చించడమే కాకుండా నూతన కోర్సుల గురించి యూనివర్సిటీ ఫెయిర్‌లో తెలుసుకోవచ్చన్నారు. ఫెయిర్‌లో అమెరికా, ఇంగ్లాండ్, ఇటలీ, కెనడా, దుబాయ్, స్విట్జర్లాండ్, ఫ్రాన్స్, సింగపూర్, వెస్ట్ ఇండీస్ ప్రతినిధులు పాల్గొన్నారు. ప్రముఖ విద్యాసంస్థలు అయిన బిట్స్, అశోక, ఓపీ జిందాల్, ఎస్ఆర్ఎం, అజీమ్ ప్రేమ్‌జీ, ఇండియానా యూనివర్సిటీలు పాల్గొన్నాయి.

హోప్ ఫౌండేషన్ చేయూత



హోప్ అధ్యక్షులు తొపుగుండ మహిపాల్ రెడ్డి, ట్రెజరర్ రెడ్డి ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హఫీజ్‌పేట్: సమాజంలో ప్రతి ఒక్కరు సేవా గుణం కలిగి ఉండాలని స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ అశోక్ అన్నారు. శనివారం చందానగర్‌లోని హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మెజిస్ట్రేట్ అశోక్, హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ్‌కుమార్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫౌండేషన్ చేస్తున్న సేవా కార్యక్రమాలు నిరుపేదలకు ఎంతో ఉపయోగపడుతున్నాయన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్

రామాయణ కల్పవృక్షం సంగీత నృత్యోత్సవాలు

మాదాపూర్: మాదాపూర్‌లోని సీసీఆర్టీలో నిర్వహిస్తున్న రామాయణ కల్పవృక్షం సంగీత, నృత్య మహోత్సవం శనివారం సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. దేశ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన కళాకారులు ప్రసంగించారు. వివిధ వస్త్రాలపై రామాయణం పెయింటింగ్, షెఫాలీచే ఎంబ్రాయిడరీ, స్వయంబోధ, శత్రుబోధ, నాగరికత జంట చక్రాలపై చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. వినయ్ వారణాసి, వివేక్ సదాశివ మండ్ ధ్రువ శ్రీరామరక్ష కథను చెప్పి సందర్శకులను అలరించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.ఎస్ఐ శివకుమార్ కథనం ప్రకారం... రామచంద్రాపురం వెలిమెలకు చెందిన వెంకటయ్య(51) బీహెచ్ఈఎల్ సొసైటీలో ఉంటున్నాడు. శుక్రవారం ఉదయం వెలిమెల నుండి బీహెచ్ఈఎల్‌కు బైక్‌పై వెళ్తుండగా నారాయణ కళాశాల సమీపంలో ఎదురుగా వచ్చిన గుర్తు తెలియని ఆటో బైక్‌ను ఢీకొంది.ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన వెంకటయ్యను చికిత్స కోసం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత ఆత్మహత్య

పటాన్‌చెరు టౌన్: అత్తింటి వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.పోలీసుల కథనం ప్రకారం ... జిన్నారం మండలం జంగంపేట గ్రామంకు చెందిన ఫకీర్, కరీంబీకి ఆరుగురు కూతుర్లు, ఇద్దరు కుమారులు. చిన్న కూతురు నసీమా బేగం(29)కు 2017లో అమీన్‌పూర్ నివాసం ఉండే ఎం.డి. పాషాతో వివాహం జరిగింది.వీరికి ఇద్దరు పిల్లలు. కొంతకాలంగా నసీమా బేగంను భర్త పాషా, అత్త షలీఫా బేగం, బావ హమీద్, మరిది గౌస్ పాషా, తోటి కోడల్లు రెహానా బేగం, పర్వీన్‌లు నసీమాని అకారణంగా హింసించేవారని, దీనిపై పలుమార్లు పెద్ద మనుషుల సమక్షంలో పంచాయతీ పెట్టామని, అయిన వారు తమ ప్రవర్తనను మార్చుకోకపోవడంతో 29 వ తేదీన రాత్రి సుమారు తొమ్మిది గంటల సమయంలో నసీమా ఇంట్లో ఫ్యాన్‌కి చీరతో ఉరి వేసుకుంది.మృతురాలి తల్లి కరీంబీ శనివారం ఫిర్యాదు చేయగా, ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కూలిన చెట్టు.. తప్పిన ప్రమాదం

మూసాపేట: మూసాపేటలో పూల దుకాణం వద్ద ఓ భారీ చెట్టు శుక్రవారం రాత్రి కూలింది. పూలదుకాణంపైకి ఒరగటంతో ప్రమాదం తప్పింది. కాగా ఈ రోడ్డుపై నిత్యం రద్దీగా ఉంటుంది. రోడ్డుపై పడి వుంటే పెద్ద ప్రమాదం జరిగేది. పూల దుకాణం కూడా ఇనుపరేకులతో ఉండటం వల్ల ప్రమాదం వాటిల్లలేదు. శనివారం ఉదయం విద్యుత్ సరఫరా నిలిపివేసి డిజాస్టర్ టీమ్ చెట్టును పూర్తిగా తొలగించారు.

ఇఫ్తార్ విందు

రామచంద్రాపురం(పటాన్‌చెరు) : తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్‌నగర్ కాలనీలో శుక్రవారం రాత్రి తెల్లాపూర్ మాజీ సర్పంచ్ మల్లేపల్లి సోమిరెడ్డి ఆధ్వర్యంలో ఇఫ్తార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు జీ.ఎల్లయ్య, కౌన్సిలర్‌లు లచ్చిరాంనాయక్, బాలజీ, శ్రీశైలం, నాగరాజు, నాయకులు ఆదర్శ్‌రెడ్డి, నగేష్, శ్రీకాంత్ రెడ్డి,ఉమేష్‌లు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం ఖాయం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ముచ్చటగా మూడోసారి బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీలు అన్నారు. మియాపూర్‌లోని నరేన్ గార్డెన్‌లో చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల సన్నాహక ప్రక్రియలో భాగంగా ఎమ్మెల్యే గాంధీ ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంను శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్, ఎమ్మెల్సీ దయానంద్‌లతో కలిసి సబితాఇంద్రారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ మాట్లాడుతూ...పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించి కేసీఆర్‌కు కానుకగా ఇద్దామన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే ప్రజల్లో వ్యతిరేకత ఎదుర్కొంటుందని, కేసీఆర్‌ను ప్రజలు గుర్తుచేసుకుంటున్నారన్నారు. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలన్నారు. చేవెళ్ల పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేసి అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్, హమీద్ పటేల్, సత్యనారాయణ, శ్రీనివాస్‌రావు, ఉప్పలపాటి శ్రీకాంత్, మంజుల రఘునాథ్‌రెడ్డి, రోజాదేవి రంగారావు, సాయిబాబా, నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

సింగూరు నీటి ప్రధాన పైప్‌లైన్ లీకేజీ



లింగంపల్లి రైల్వే స్టేషన్ వద్ద సింగూరు ప్రధాన లైన్‌కు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

శేరిలింగంపల్లి: లింగంపల్లి రైల్వేస్టేషన్ ముందు రోడ్డులో సింగూరు వాటర్‌లైన్‌కు మరమ్మతులు జరుగుతుండడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. శుక్రవారం రాత్రి సింగూరు ఫేజ్4 లైన్ లీకేజీ కావడంతో వాటర్‌వర్క్స్ విభాగం మరమ్మతులు చేపట్టింది. ఆయా పనులు శనివారం తెల్లవారుజాము వరకు సాగినట్లు సిబ్బంది బాలరాజు తెలిపారు. అయితే ఆయా పనులతో లింగంపల్లి రైల్వే స్టేషన్‌కు వచ్చే ప్రయాణికులు రాత్రి వేళ తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. వాహనాలను మళ్ళించేందుకు సరైన ఏర్పాట్లు చేయకపోవడంతో లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి వచ్చే వాహనాలు విలేజ్ నుంచి మళ్ళించడంతో ఇబ్బందిగా మారింది.

షార్ట్‌సర్క్యూట్.. కాలిన విద్యుత్ స్తంభం



రాయదుర్గం: రాయదుర్గంలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. రాయదుర్గం ప్రధానరోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభం వద్ద షార్ట్ సర్క్యూట్ వచ్చింది. ఆ స్తంభానికి కేబుల్ వైర్లు ఇబ్బడిముబ్బడిగా చుట్టి ఉండడంతో వైర్లు అంటుకుని మంటలు రేగాయి. స్తంభం పొడవునా మంటలు ఎగబాకడంతో ప్రధాన రోడ్డుపై ట్రాఫిక్ నిలిచిపోయింది .స్థానికులు విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ఘటనాస్థలికి వారు చేరుకొనే లోపల స్థానికులు, పోలీసులు కలిసి మంటలను ఆర్పివేశారు. అనంతరం విద్యుత్ సిబ్బంది యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి రెండు గంటల తర్వాత విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. విద్యుత్ స్తంభం కాలడం ఏమిటని ప్రజలు విస్తుపోయారు.

పగలూ వెలుగులు..



జగద్గిరిగుట్ట ఇందిరాగాంధీ సర్కిల్‌లో పగలూ వెలుగుతున్న విద్యుత్ హైమాస్ట్ లైట్లు



రిక్షాపుల్లర్స్ కాలనీలో..



ఆల్విన్‌కాలనీ: అసలే వేసవి.. విద్యుత్ ఆదా చేయాల్సిన అధికారులే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో విద్యుత్ వృధా అవుతోంది. కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని ఆల్విన్‌కాలనీ, వివేకానందనగర్ డివిజన్‌లలో పట్టపగలు వీధిలైట్లు వెలుగుతున్నాయి. లైట్లను ఉదయం ఆపివేయాల్సిన సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించటంతో కొన్ని వారాలుగా విద్యుత్ దీపాలు పగలు, రాత్రి వెలుగుతున్నాయని స్థానికులు చెప్పారు. ఆటోమేటిక్ ఆన్ ఆఫ్ సిస్టమ్ ఉన్నప్పటికి అది పనిచేయకపోవటంతో సిబ్బంది ఆన్ ఆఫ్ చేయాల్సి ఉంటుంది. ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.